కనులపండువగా గురుపౌర్ణమి

● మారుమోగిన సాయినామస్మరణ

స్టేషన్ మహబూబ్‌నగర్/సాక్షినెట్‌వర్క్: గురుపౌర్ణమి వేడుకలు సోమవారం పట్టణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని వివిధ ఆలయాల్లో ఉదయం నుంచి విశేష పూజలు చేశారు. బస్టాండ్ సమీపంలో ద్వారాకామాయి సాయి మందిరంలో, గణేశ్‌నగర్ శ్రీఅభయాంజనేయస్వామి షిరిడీసాయి ఆలయంలో, శ్రీనివాసకాలనీ లోని షిరిడీసాయి దేవాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో డైట్ కళాశాలలో వేడుకలు జరిగాయి. డాక్టర్ పొద్దుటూరు ఎల్లారెడ్డి పాణీష్, పాండురంగం, బాలకిష్టయ్య, శివరాజప్ప, శారద, వనజారెడ్డి, వివేకానంద, వెంకట్రాముడు తదితరులు పాల్గొన్నారు.

● నవాబుపేట మండలంలోని సాయి ఆలయాల్లో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. నవాబుపేట ఆలయ ట్రస్టీ బృంగి రవీందర్, కార్యదర్శి అనంతకృష్ణయ్య, సరస్వతీ, ఎంపీడీఓ శ్రీలత, ఏపీఓ జ్యోతీ, సూపర్‌వైజర్ శకుంతల పాల్గొన్నారు.

● జడ్చర్ల పట్టణంలో సాయినగర్ సకలదేవతల ఆలయం, విజయ్‌నగర్ కాలనీలోనూ వేడుకలు ఘనంగా చేపట్టారు. సత్యసాయిబాబా ఆలయం, పెద్దగుట్టపై ఉన్న సాయి ఆలయం, దత్తమందిరంలోనూ గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు.


జిల్లాకేంద్రంలోని ద్వారకామయిలో బారులుతీరిన భక్తులు

● గండేడ్ మండలంలోని వెన్నాచేడ్‌లో ధర్మకర్త అనంతసేనారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగాయి. సర్పంచ్ పుల్లారెడ్డి, మాజీ సర్పంచులు అనంతలక్ష్మారెడ్డి, బోయిని గోపాల్, కేఎస్ఆర్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షురాలు రాజేశ్వరమ్మ, సత్యసాయి సేవాసమితి ఆర్గనైజింగ్ సెక్రటరీ శివమల్లప్ప, మండల కన్వీనర్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

● అడ్డాకుల శాఖాపూర్ శివారులో కందూర్ స్టేజీ సాయిబాబా ఆలయంలో, మూసాపేట మండలంలోని సంకలమద్ది హరిహర అయ్యప్పక్షేత్రం వద్ద సాయి ఆలయంలోనూ వేడుకలు నిర్వహించారు.

● దేవరకద్ర మండలంలోని లక్ష్మీపల్లి వేడుకల్లో దేవస్థాన కమిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

● భూత్పూర్ మున్సిపాలిటీలోని అమిస్తాపూర్ సమీపంలోని శ్రీసచ్చిదానంద ఆశ్రమంలో సోమవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు.

● హన్వాడ మండలంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాందీపని శ్రీకృష్ణ గురుమందిరం, చిన్నదర్పల్లి గోశాల్లో ఈ సందర్భంగా ప్రత్యేకపూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


జడ్చర్లలోని సాయినగర్ సకలదేవతల ఆలయంలో ..


వెన్నాచేడ్‌లో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


ద్వారకామయి మందిరంలో సాయివ్రతాలు


వేడుకల్లో పాల్గొన్న భక్తులు


నవాబుపేటలో సాయినాథుని ఆలయంలో వేడుకలు


అమిస్తాపూర్ సాయిబాబా ఆలయంలో..


జడ్చర్లలో సాయి దేవాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆలయాల అభివృద్ధికి కృషి



దేవరకద్ర: నియోజకవర్గంలో 45 ఆలయాలకు దూప దీప నైవేద్యం కింద ప్రోసీడింగ్ కాపీలను సోమవారం అర్చకులకు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి కృషి ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. ఎంపీపీ రమాదేవి, తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ శ్రీనివాసులు, సింగిల్ విండో చైర్మన్ నరేందర్‌రెడ్డి, దేవస్థాన కమిటీ చైర్మన్ శివానంద్, నాయకులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లు ఇవ్వాలి

చిన్నచింతకుంట: అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు, పింఛన్లు అందించాలని బీఎస్పీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ బసిరెడ్డి సంతోష్‌రెడ్డి డిమాండ్ చేశాడు. మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో సోమవారం రాస్తారోకో చేపట్టారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ సువర్ణరాజు, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రాలు అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులు దివాకర్, జైపాల్, ప్రకాష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

గార్లపహాడ్‌పై వివక్ష తగదు

కోయిల్‌కొండ: గార్లపహాడ్ మండలం చేయడంలో అధికారులు వివక్ష చూపడం తగదని జేఏసీ మండల కన్వీనర్ రామునాయక్, వెంకట్రామిరెడ్డి అన్నారు. సోమవారం రిలేదీక్షలో పాల్గొని మాట్లాడారు. 15 గ్రామపంచాయతీల మద్దతు కలిగి, అన్ని అర్హతలు ఉన్న గార్లపహాడ్‌ను ఎందుకు మండలంగా ప్రకటించడం లేదని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

వాల్‌పోస్టర్ విడుదల

చిన్నచింతకుంట: గ్రామ పంచాయతీ కార్మికులు ఈ నెల 6 నుంచి నిర్వహించే నిరవధిక సమ్మె వాల్‌పోస్టర్‌ను సోమవారం మండల కేంద్రంలో తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జేఏస్ దేవదానం, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నటరాజుకు ప్రత్యేకపూజలు

జడ్చర్ల టౌన్: ఆషాఢపౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం సంస్కారభారతి ఆధ్వర్యంలో నటరాజ పూజ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నటరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భాగంగా సీనియర్ తబలిస్ట్ రాములును సత్కరించారు. సంస్కారభారతి సభ్యులు గోనెల రాధాకృష్ణ, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అవగాహన అవసరం

నవాబుపేట: అంటువ్యాధుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ శ్రీలత, మండల వైద్యాధికారిని విజయలక్ష్మి పేర్కొన్నారు. వాటి గురించి పూర్తిగా అవగాహన కలిగిఉండాలని, జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టాలన్నారు. సూపర్‌వైజర్ శకుంతల, శరభలింగం, రాఘవేందర్, వైద్య సిబ్బంది అవినాష్, శ్రీనువాస్, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

జడ్చర్ల టౌన్: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని జెడ్పీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య అన్నారు. మాటుబండతండాకు చెందిన సుజాతకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి విడుదలైన రూ.24వేలు సోమవారం అందజేశారు.

మిడ్జిల్: వల్లభ్‌రావుపల్లి గ్రామానికి చెందిన కళావతి, లింబ్యా తండాకు చెందిన శంకర్, మసిగొండ్లపల్లికి చెందిన మన్నెయ్య, వేములకి ఈశ్వరమ్మ, వ్యాడాల్‌కి చెందిన బంగారమ్మలకు సీఎం సహాయనిధి నుంచి చెక్కులు మంజూరు అయ్యాయి. ఈ మేరకు సోమవారం ఎంపీపీ సుదర్శన్ వారికి చెక్కులను అందజేశారు. జెడ్పీటీసీ శశిరేఖా, బీఆర్ఎస్ అధ్యక్షుడు పాండుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీధర్‌కు అవార్డు



నవాబుపేట: మండల పరిధిలోని యన్మన్‌గండ్ల జెడ్పీ పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు శ్రీధర్‌కు ఫ్రైడ్ అఫ్ తెలంగాణ అవార్డు లభించింది. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో విద్యావేత్తలు, సైన్స్ బృందాలు అవార్డుకు ఎంపిక చేశారని ఆయన సోమవారం తెలిపారు.

డీటీఓ శ్రీనివాసులుకు సన్మానం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఇటీవల డీటీఓగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులును తెలంగాణ పెన్షనర్ల యూనియన్ నాయకులు సోమవారం ఆయన చాంబర్‌లో సన్మానించారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సాయిలుగౌడ్, కర్యాదర్శి బాలకిషన్, రాంచంద్రయ్య, సుధాకర్, బురానోద్దీన్, ప్రభాకరచారీ, బాలరాజు, నారాయణరెడ్డి, వెంకట్రాములు, బాలయ్య పాల్గొన్నారు.

బ్యాగుల పంపిణీ

జడ్చర్ల టౌన్: రామభారతి ట్రస్టు ఆధ్వర్యంలో సంజీవయ్యకాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జ్యూట్ బ్యాగులు సోమవారం పంపిణీ చేశారు. వార్డు కౌన్సిలర్ కోనేటి పుష్పలత, ముడా డైరెక్టర్ రవిశంకర్, వాసవీక్లబ్ గవర్నర్ మేడిశెట్టి రామకృష్ణ, హెచ్ఎం కవిత తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కోల్‌బాయితండాలో ఉపాధ్యాయుడు రాజశేఖర్‌రెడ్డి తన సోదరుడు దేవేందర్ రెడ్డి జ్ఞాపకార్థం 22 మంది విద్యార్థులకు నోటుపుస్తకాలు, ఇతర సామగ్రి అందించారు. సర్పంచ్ స్వరూప, హెచ్ఎం మాధవి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

అడ్డాకుల: శాఖాపూర్ శివారులోని టోల్‌ప్లాజా వద్ద రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. బాధితుల వివరాల ప్రకారం...కర్ణాటకకు చెందిన బొలేరో వాహనంలో మామిడి పండ్లను హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. మార్గమధ్యలో టోల్‌ప్లాజా దాటిన తర్వాత శనివారం అర్ధరాత్రి బొలేరోను వెనుక నుంచి వచ్చిన డీసీఎం ఢీకొట్టింది. దీంతో బోలేరో ముందుకు వెళ్లి దాని ముందున్న మరో వాహనానికి తగిలి రోడ్డు కిందకు దూసుకెళ్లి బోల్తాపడింది. వాహనంలో ఇద్దరు ఉండగా అందులో డ్రైవర్ జాకీర్ తలకు గాయాలయ్యాయి. మరో వ్యక్తి సురక్షితంగా ప్రమాదం నుంచి బయటపడ్డాడు. బొలేరో ముందు భాగం నుజ్జునుజ్జయింది. డీసీఎం అద్దాలు ధ్వంసమయ్యాయి. ఘటనపై విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఆటో చోరీ..

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలోని రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఓ ఆటోను గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లిన ఘటన సోమవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. స్టేషన్ ఏరియాకు చెందిన రాజు ఆదివారం రాత్రి తన ఇంటి ముందు ఆటోను నిలిపాడు. కాగా సోమవారం ఉదయం కనిపించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు ఆటో కోసం చుట్టు పక్కల మండలాలకు సమాచారం ఇచ్చారు.

రైతులకు అండగా బీఆర్ఎస్

దేవరకద్ర: రైతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని హజిలాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త లక్ష్మయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబానికి పార్టీ తరపున ఇన్సూరెన్స్ కింద రూ. 2 లక్షల చెక్కును, అదే విధంగా రైతుబీమా పథకం కింద వచ్చిన రూ.5 లక్షల చెక్కును స్వయంగా ఇంటికి వెళ్లి బాధితులకు సోమవారం అందించారు. ఎంపీపీ రమాదేవి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డి, మండల నాయకులు శ్రీకాంత్ యాదవ్, నరేందర్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, భాస్కర్, బుచ్చారెడ్డి, సుల్తాన్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేట గ్రామానికి చెందిన నర్సిములుకు సీఎం సహాయ నిధి ద్వారా రూ.3లక్షలు మంజూరు అయ్యాయి. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బాధితుడి కుమారుడికి సోమవారం దేవరకద్రలోని తన క్యాంపు కార్యాలయంలో ఎల్‌ఓసీని అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు జి.ఇంద్రయ్యసాగర్, జానంపేట ఎంపీటీసీ అంజనేయులు, నాయకులు శివరాములు యాదవ్, మల్లయ్య యాదవ్ తదితరులు ఉన్నారు.

ఎట్టకేలకు మొదలైన రోడ్డు పనులు

అడ్డాకుల: మూసాపేట మండలం చక్రాపూర్ బీటీ రోడ్డు రెన్యూవల్ పనులు మధ్యలో నిలిచిపోగా ఎట్టకేలకు సోమవారం పనులు మళ్లీ మొదలయ్యాయి. జాతీయ రహదారి నుంచి చక్రాపూర్ మీదుగా లక్ష్మీంపల్లి రోడ్డు వరకు 7.20కిలోమీటర్ల దూరం బీటీరోడ్డు రెన్యూవల్‌కు పంచాయతీరాజ్ శాఖ నుంచి ఎంఆర్ఆర్ ద్వారా రూ.2.45కోట్లు మంజూరయ్యాయి. ఏప్రిల్ 2న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. తర్వాత రోడ్డు పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్ కొన్నాళ్లపాటు పనులను మధ్యలోనే నిలిపేశారు. దీంతో చక్రాపూర్, కనకాపూర్ తండా, స్ఫూర్తితండా వాసులు కంకర రోడ్డుతో ఇబ్బందులను ఎదుర్కొన్నారు. తాజాగా బీటీరోడ్డు పనులు మొదలు కావడంతో మూడు గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పనులను పంచాయతీరాజ్ ఏఈ లక్ష్మణ్‌గౌడ్ పర్యవేక్షిస్తున్నారు.


పనులను పరిశీలిస్తున్న ఏఈ లక్ష్మణ్‌గౌడ్

మెరుగైన బోధనతో సత్ఫలితాలు


మహమ్మదాబాద్ మండలం బొమ్మికుంటతండాలో పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

మహమ్మదాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని, తద్వార సత్ఫలితాలు వస్తాయని మండల విద్యాధికారి వెంకటయ్య అన్నారు. బొమ్మికుంట తండా పాఠశాలను సోమవారం సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. త్వరలోనే విద్యార్థులందరికీ అన్ని పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు వస్తాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన తప్పకుండా పాటించాలని సూచించారు.

జడ్చర్ల టౌన్: పట్టణంలోని కావేరమ్మపేట ప్రాథమిక పాఠశాల తెలుగు మీడియం, ఉర్దూమీడియం, జయప్రకాష్‌నగర్‌లోని ప్రాథమిక పాఠశాలను సోమవారం ఎంఈఓ మంజులాదేవి తనిఖీచేశారు. రిజిస్టర్లు, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. సమయపాలన పాటించటంతోపాటు విద్యార్థులకు సులువైన పద్ధతుల్లో బోధన చేస్తున్నందున ఉపాధ్యాయులను అభినందించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

పాలమూరు: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమంపై దృష్టి పెట్టిందని పార్టీ జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మాచారి అన్నారు. జోనల్ ఇన్‌చార్జ్ సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో శివశక్తినగర్, బాలాజీనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాలపై బ్రోచర్లను ప్రజలకు అందించారు. పట్టణ అధ్యక్షుడు నారాయణ యాదవ్, సుబ్రహ్మణ్యం, మహిళ మోర్చా జిల్లా అధ్యక్షురాలు వేణమ్మ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నచింతకుట: అమ్మపురం సోమవారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నంబిరాజు కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా ప్రజలు తెలంగాణ ప్రభుత్వ మోసాలను గమనిస్తున్నారన్నారు. త్వరలోనే తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మనఊరు మనబడి పనులను పరిశీలించారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తూ, నాణ్యతలోపంతో చేపట్టారని ఆరోపించారు. మండల అధ్యక్షుడు దశరథ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


జిల్లాకేంద్రంలో ప్రచారం చేస్తున్న బీజేపీ నేతలు

బాలిక అదృశ్యం

అడ్డాకుల: మూసాపేట మండలం వేముల గ్రామానికి చెందిన బాలిక(17) అదృశ్యమైనట్లు హెడ్ కానిస్టేబుల్ శివారెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన బాలిక ఆదివారం సాయంత్రం తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయిందన్నారు. ఎంత వెతికినా ఆచూకీ లభించలేదని సోమవారం కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

గురువులకు ఘన సన్మానం

స్టేషన్ మహబూబ్‌నగర్: గురుపౌర్ణమిని పురస్కరించుకొని స్థానిక శ్రీవిరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం పలువురు భక్తి, సాంస్కృతిక కళారంగ గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వడ్ల శేఖరాచారి, ప్రధాన కార్యదర్శి వి.నారాయణ, కోశాధికారి పెద్ద నారాయణ, మనుమయ సంఘం పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షులు రాఘవాచారి, కార్యదర్శి చిట్యాల రమేశ్, బిక్షపతి, లక్ష్మీనారాయణ, ఉద్యోగ సంఘం, దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాల అప్‌గ్రేడ్‌కు తీర్మానం

నవాబుపేట: కాకర్లపహాడ్ యూపీఎస్‌ను ఎనమిదో తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయాలని గ్రామస్తులు తీర్మానం చేశారు. సర్పంచ్ జంగమ్మ అధ్యక్షతన సోమవారం పాఠశాలలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఎంఈఓ రాజునాయక్, క్లస్టర్ హెచ్ఎం దశరథ్ నాయక్ అప్‌గ్రేడ్‌కు సహకరిస్తామని హామీ ఇచ్చారు. వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి పాఠశాలలో అదనపు గదులను నిర్మాణం కోసం ఎమ్మెల్యే ద్వారా కృషి చేస్తానని అన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ గోపాల్, సీఆర్పీ జనార్దన్ పాల్గొన్నారు.

తడి, పొడిచెత్తపై అవగాహన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని భగీరథకాలనీ (వార్డు నం.22) లో సోమవారం ప్రజలకు తడి, పొడిచెత్తపై మున్సిపల్ సిబ్బంది అవగాహన కల్పించారు. ఇంటింటికీ వచ్చే స్వచ్ఛ ఆటోలకు తడి, పొడిచెత్తను వేరు చేసి బుట్టల్లో అందజేయాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): స్కూళ్లలో పనిచేస్తున్న స్వీపర్ల సమస్యలను పరిష్కరించాలని టీఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ స్కూల్ స్వీపర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌ముందు ధర్నా నిర్వహించారు. కనీస వేతనం రూ. 27వేలు ఇవ్వాలన్నారు. స్వీపర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్‌చేశారు. 8 రోజులుగా దీక్షలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌రవినాయక్‌కు అందజేశారు. సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గట్టన్న ఇతర నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం అందజేత

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో పనిచేసే సుమారు 430మంది పారిశుద్ధ్య కార్మికులకు సోమవారం చైర్మన్ కేసీ నర్సింహులు చేతుల మీదుగా పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్‌మెంట్ యూనిఫాం, చీరలు, రేడియం అప్రాన్స్, రెయిన్ కోట్లు, కొబ్బరినూనె, సబ్బులు, పాదరక్ష లు తదితర వస్తువులు అందజేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ తాటి గణేష్‌కుమార్, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు రవీందర్‌రెడ్డి, వాణికుమారి, హెల్త్ అసిస్టెంట్ వజ్రకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

హన్వాడ: వ్యవసాయ పొలానికి వెళ్లే బాటను తొలగించారని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తిరుమలగిరికి చెందిన బాధితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పి.బాలకిష్టయ్యతో పాటు మరో ఏడు కుటుంబాలకు చెందిన రైతులు సోమవారం తహసీల్దార్ బక్క శ్రీనివాసులు కలిసి వినతిపత్రం సమర్పించారు.

అధిక ఫీజులు అరికట్టాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాల వద్ద నిరసన చేపట్టారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, రాజు మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలను, స్టేషనరీ వస్తువులను అమ్ముతున్నారని, అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తూ పీడిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శేఖర్, సురేష్, నరేందర్, భానుచందర్, ప్రకాష్ పాల్గొన్నారు.

సర్పంచ్ సంతకం ఫోర్జరీ!

కోయిల్‌కొండ: మండలంలోని బూర్గుపల్లి గ్రామానికి చెందిన మధుసుదన్‌రెడ్డి, సర్పంచ్ కృష్ణవేణి సంతకాన్ని ఫోర్జరీ చేశాడని వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌తోపాటు, గ్రామపెద్దలు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సర్వేనెం.96లో సర్పంచ్ తెలియకుండా సంతకాలు చేసి ఫోర్జరీచేసి విద్యుత్ కనెక్షన్ తీసుకోని కోళ్లఫారం నిర్మించడాని ఆరోపించారు.గ్రామ పంచాయతీ విచారణ చేయగా ఫోర్జరీ డాక్యుమెంట్ బయటపడిందని, అదేవిధంగా దొంగ స్టాంపులు కూడా తయారుచేయించాడని తమ దృష్టికి వచ్చిందని సర్పంచ్ కృష్ణవేణి కలెక్టర్‌కు తెలిపారు. బయట గ్రామప్రజలతో సర్పంచ్ సంతకాలతో తనకు పని లేదని బూతుమాటలతో దళిత సర్పంచ్ కావడంతో వేధిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్థికసాయం

మిడ్జిల్: వాడ్యాల్‌కి చెందిన చాంద్‌పాషా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతడితో పాటు చదువుకున్న 1996–1997 పదో తరగతి మిత్రులు రూ. 30వేల నగదును సోమవారం బాధిత కుటుంబానికి సాయంగా అందించారు. శంకర్, రవీందర్‌రెడ్డి, శ్రీనువాసులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయం అలవర్చుకోవాలి

చిన్నచింతకుంట: రైతులు ప్రకృతి సేంద్రియ వ్యవసాయం అలవర్చుకొని సమాజ మార్పుకు నాంది పలకాలని గ్రామ భారతి సంస్థ జిల్లా అధ్యక్షుడు అమరవాది రాజ నర్సింహా రైతులకు సూచించాడు. సోమవారం అప్పంపల్లిలో సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు నారసంచులను అందజేశారు. పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం ప్రకృతి సేంద్రియ ఆహార ఉత్పత్తులతో చేసిన వంటకాలను ఏర్పాటు చేశారు. బహుళజాతి కంపెనీల కుట్రలతో భారతీయ వ్యవసాయ రంగం సంక్షోభం ఎదుర్కొంటోందన్నారు. సేంద్రియ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని పేర్కొన్నారు. సంస్థ జిల్లా కోశాధికారి వల్లభదాసు ఆంజనేయులుగౌడ్, ప్రచార కార్యదర్శి చక్రవర్తి గౌడ్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు


రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేష్

మహబూబ్‌నగర్ (వ్యవసాయం)/జడ్చర్ల టౌన్: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సోమవారం మహబూబ్‌నగర్, జడ్చర్ల పట్టణాల్లో ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు చేశారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి బి.వెంకటేష్ ఎరువుల స్టాక్‌ను, రికార్డులను పరిశీలించారు. ఎరువులు, విత్తనాల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు విక్రయించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు డీలర్ల వద్ద కొనుగోలు చేసే విత్తనాలు, ఎరువులకు సంబంధించి రశీదులను పంట కాలం పూర్తయ్యే వరకు దాచుకోవాలని అన్నారు. పంట దెబ్బతింటే పరిహారం కావాలంటే ఈ రశీదులు తప్పనిసరి అని అన్నారు. దుకాణదారులు ఎంఆర్‌పీ కంటే ఎక్కువ డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒకవేళ అలా ఎవరైనా చేస్తే సంబంధిత మండల వ్యవసాయ అధికారి దృష్టికి రైతులు తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట ఏఓలు శ్యాంయాదవ్, గోపీనాథ్ ఉన్నారు.

అధ్యాపకురాలికి అభినందన



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో అధ్యాపకురాలిగా ఎంబీఏ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తున్న నాగసుధకు పీహెచ్‌డీ పట్టాను ప్రకటిస్తున్నట్లు ఓయూ తెలిపిన నేపథ్యంలో ఆమెను వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ అభినందించారు. ఈమేరకు ఆమె 'ఏ స్టడీ ఆన్ రిస్క్ అండ్ రిటర్న్ అనాలసిస్ ఆన్ సెలక్ట్ మ్యూచువల్ ఫండ్ అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించారు. పీయూ రిజిస్ట్రార్ గిరిజ మంగతాయారు, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి అధ్యాపకులు ఉన్నారు.

అధ్యాపకులను సహకరించాలని వినతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉద్యోగ భద్రత లేకుండా కొన్ని సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నామని పాలమూరు యూనివర్సిటీలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న అధ్యాపకులు అన్నారు. పుటా సంఘం ఆధ్వర్యంలో పీయూ వీసీతో పాటు పలువురు అధికారులకు సోమవారం వినతిపత్రం అందజేశారు. వెంటనే రెగ్యులరైజ్‌కు సహకరించాలని కోరారు. భూమయ్య, రవికుమార్, అర్జున్‌కుమార్, సుదర్శన్‌రెడ్డి, విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

భూమిపూజ

జడ్చర్ల టౌన్: మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి, కౌన్సిలర్లతో కలసి పర్యటించారు. 17వ వార్డు భక్తమార్కండేయ ఆలయ ప్రాంగణంలో కమిటీహాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. 16వ వార్డులో మురుగు కాల్వను పరిశీలించారు. పేరుకుపోయిన చెత్తను జేసీబీ సాయంతో తొలగింపజేశారు. 21వ వార్డులో నిర్మిస్తున్న పీర్లమజీద్ పనులు పరిశీలించారు.

గొర్రెల పంపిణీ చేపట్టాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ప్రభుత్వం రెండోవిడుత గొర్రెల పంపిణీ వెంటనే చేపట్టాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిల్లె గోపాల్ డిమాండ్ చేశారు. సంఘం నాయకులతో కలిసి సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం రెండవ విడతలో 80 వేల మంది డీడీలు కట్టగా అందులో 1500 మందికి మాత్రమే పంపిణీ చేశారని, మిగతా వారికి పంపిణీ చేసే చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే గొర్రెల్లో కొన్ని చనిపోతున్నాయని పేర్కొన్నారు. నగదు బదిలీ చేపడితే మేలు జరుగుతుందన్నారు. రెండో విడత చర్యలు చేపట్టని పక్షంలో గొర్రెల పెంపకందారులతో ఆందోళనలు చేస్తామన్నారు. సంఘం నాయకులు శివ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.